## హామీల అమల్లో కాంగ్రెస్ విఫలం



మాడ్గుల మండల కేంద్రం నుంచి కల్వకుర్తికి బైక్ ర్యాలీగా వెళ్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు/ మాడ్గుల, డిసెంబర్ 8: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలం చెందిందని మాజీ జడ్పీటీసీ సభ్యుడు హరిప్రసాద్ మండిపడ్డారు. హామీలు అమలు చేయాలని ఆమనగల్లు పట్టణం నుంచి కల్వకుర్తి వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కో-కన్వీనర్ నర్సింహ, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, కౌన్సిలర్లు లక్ష్మణ్, విజయ్‌కృష్ణ, చెన్నకేశవులు, నాయకులు నేనావత్ నరేందర్, వెంకటయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు మహేశ్, శ్రీశైలం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

**మాడ్గుల నుంచి..**

మాడ్గుల మండల కేంద్రం నుంచి బీజేపీ మండల అధ్యక్షుడు పెద్దయ్య యాదవ్ ఆధ్వర్యంలో భారీగా బైక్ ర్యాలీకి తరలివెళ్లారు. కార్యక్రమంలో శ్రీను, రఘుపతిగౌడ్, భిక్షపతి, మధు, శ్రీనివాస్‌గౌడ్, గిరి పాల్గొన్నారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

**హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు**



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ కృష్ణంరాజు

యాచారం, డిసెంబర్8: సైబర్ నేరాలు, దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు సూచించారు. కందుకూరు మండలంలోని సాయిరెడ్డిగూడ గ్రామంలో దొంగతనాలు, సైబర్‌నేరాల పట్ల గ్రామస్తులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మూరుమూల గ్రామాల్లో జరిగే దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఎలాంటి సమాచారం అడిగినా చెప్పొద్దన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, ఎక్కడైనా దొంగతనాలు జరిగినా వెంటనే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై తేజంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# శిథిలమవుతున్నయ్..

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనాలు
- అర్ధాంతరంగా నిలిచిన సమావేశ మందిరం
- ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం
- లక్షల్లో ప్రభుత్వ నిధులు వృథా
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు



అర్ధాంతరంగా నిలిచిపోయిన మీటింగ్ హాల్ బిల్డింగ్

యాచారం, డిసెంబర్ 8 : మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజావసరాల కోసం నిర్మించిన ప్రభుత్వ భవనాలు నిరుపయోగంగా మారాయి. కొన్ని భవనాలు నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోతే, ఇంకొన్ని ప్రారంభానికి నోచుకోకుండా పోయాయి. దీంతో క్రమక్రమంగా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. మండలంలో అంగన్‌వాడీ భవనం, ప్రాథమిక పాఠశాల, వసతి గృహాలు, కమ్యూనిటీ హాళ్లు, ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న అగ్రికల్చర్ కార్యాలయ భవనం

**నిలిచిన పనులు..**

మండల పరిషత్ కార్యాలయం పక్కనే నిర్మించిన సమావేశ మందిర భవనం నిలిచిపోయింది. రూ.1.5కోట్ల నిధులతో గ్రౌండ్ ఫ్లోర్‌లో దుకాణ సముదాయం, మొదటి అంతస్తులో విశాలమైన సమావేశ మందిరాన్ని నిర్మించేందుకు అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సంకల్పించారు. నిధుల కొరతతో భవనం పిల్లర్లపై స్లాబ్ వేసి వదిలేశారు. దీంతో నిర్మాణ పనులు ముందుకు సాగడంలేదు. సమావేశ మందిరానికి నిధులు మంజూరు అయ్యేదెన్నడో, పనులు పూర్తయ్యేదెన్నడోనని ప్రజలు, అధికారులు ఎదురుచూస్తున్నారు.

**ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం**

యాచారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో పదేళ్ల క్రితం రూ.25లక్షల జడ్పీ నిధులతో గెస్ట్ హౌస్‌ను నిర్మించారు. అది నేటికీ ప్రారంభానికి నోచుకోకుండా పోయింది. గెస్ట్‌హౌస్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

**మాల్‌లో కూరగాయల మార్కెట్, బస్టాండ్ వృథా**

మండలంలోని మాల్‌లో రూ.25లక్షలతో నిర్మించిన కూరగాయల దుకాణ సముదాయం కోసం నిర్మించిన షట్టర్లు కొన్నేళ్లుగా వృథాగా ఉన్నాయి. పక్కనే ఇరవై ఏండ్ల కింద నిర్మించిన ప్రయాణికుల ప్రాంగణం సైతం వృథాగా మారింది. అధికారులకు ఎన్నిమార్లు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**కొన్నేండ్లుగా నిరుపయోగం**

మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో హౌసింగ్ కార్యాలయం, వ్యవసాయ శాఖ కార్యాలయం, పాత ఐకేపీ, మండల కేంద్రంలోని పాఠశాల భవనం, మేడిపల్లిలో ఎస్సీ బాలుర వసతి గృహం, ప్రాథమిక పాఠశాల భవనం, నల్లవెల్లిలో అంగన్‌వాడీ భవనం, నందివనపర్తిలో మార్కెట్ సముదాయం తదితర భవనాలు ప్రజా అవసరాలకు ఉపయోగకరంగా లేకుండా పోయింది.

**ఉపయోగంలోకి తీసుకురావాలి**



మండలంలో నిరుపయోగంగా ఉన్న భవనాలను అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి మాల్‌లోని దుకాణ సముదాయ షెట్టర్లు, బస్టాండ్‌ను ఉపయోగంలోకి తీసుకురావాలి. శిథిలావస్థలో ఉన్న భవనాలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి. అర్ధాంతరంగా నిలిచిపోయిన ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పూర్తి చేయాలి. ప్రభుత్వ అతిథి గృహాన్ని తక్షణమే ప్రారంభించాలి.

**- పోలెపల్లి వినోద్, నల్లవెల్లి మాజీ ఉపసర్పంచ్**

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా**



మండలంలో వృథాగా ఉన్న ప్రభుత్వ భవనాల విషయాన్ని ప్రభుత్వ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. మండల పరిషత్ ఆవరణలో నిర్మాణంలో ఆగిపోయిన సమావేశ మందిరం, ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాలుగా కృషి చేస్తా. మండలంలో నిర్మాణంలో ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

**- నరేందర్‌రెడ్డి, ఎంపీడీవో యాచారం**



వృథాగా ఉన్న హౌసింగ్ కార్యాలయ భవనం



మాల్‌లో ఉపయోగంలోలేని దుకాణ సముదాయ షెటర్లు



మేడిపల్లిలోని పాఠశాల భవనం దుస్థితి



ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం

## రేపు చేవెళ్లలో జాబ్ మేళా

షాబాద్, డిసెంబర్ 8: ఈ నెల 10న చేవెళ్లలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 108 అంబులెన్స్ సంస్థలో ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. పైలెట్(డైవర్), ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) ఉద్యోగాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. పైలెట్‌కు విద్యార్హత పదో తరగతి పాసై ఉండాలని, 23-35 ఏండ్ల వయస్సు కలిగి, ఎల్‌ఎంవీ బ్యాడ్జ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఈఎంటీకి విద్యార్హత ఎంఎల్‌టీ, డీఎంఎల్‌టీ, ఏఎన్‌ఎం, ఎంపీహెచ్‌ఏ, జీఎన్‌ఎం, బీఎస్సీ కలిగి ఉండాలని, 30 సంవత్సరాలలోపు వయస్సు ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు రంగారెడ్డి జిల్లాలో ఎక్కడైనా పనిచేయాలన్నారు. మంగళవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు చేవెళ్ల ప్రభుత్వ దవాఖాన వద్ద ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జిరాక్స్ కాపీలను వెంట తీసుకుని ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9393778877లో సంప్రదించాలన్నారు.

## హామీలు నెరవేర్చాలి



కల్వకుర్తి పట్టణానికి తరలివెళుతున్న బీజేపీ నాయకులు

కడ్తాల్, డిసెంబర్ 8: అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు విమర్శించారు. సర్కార్ వైఫల్యాలపై కల్వకుర్తి పట్టణంలో ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీకి మండలం నుంచి బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చిందని విమర్శించారు. హామీలను నెరవేర్చేదాక కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాన్యానాయక్, సాయిలాల్‌నాయక్, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, కుమార్, శ్రీను పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



కుంట్లూరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 8: మున్సిపాలిటీ పరిధి రాజీవ్ గృహకల్ప కుంట్లూరులో జైభీమ్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మునగనూరు సౌమ్య హాస్పిటల్ వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జైభీమ్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మారయ్య, సంయుక్త కార్యదర్శి భాస్కర్, యాదయ్య, సత్యనారాయణ, బాబురావు, మల్లేశ్, నాయకులు గిరీశ్, నందు, శ్రీనివాసాచారి, కృష్ణమాచారి పాల్గొన్నారు.

# అకాల వర్షం.. అపార నష్టం..



చేవెళ్లటౌన్: తడిసిన వరి ధాన్యాన్ని ఆర బెట్టిన రైతులు



ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌లో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతు

ఆమనగల్లు, డిసెంబర్ 8: రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాత ఆశలపై నీళ్లు చల్లాయి. ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన పంటపై వరుణుడి ఆగ్రహంతో రైతుల జీవితం చిన్నాభిన్నమైంది. శనివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రమైన ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌కు రైతులు తీసుకువచ్చిన ధాన్యం తడిసిపోయి కొంత మేర మొలకెత్తింది. ఆ ధాన్యాన్ని చూపుతూ రైతులు వాపోయారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

**షాద్‌నగర్‌లో ముసురు..**

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 8: షాద్‌నగర్ పట్టణంలో ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ముసురుతో కూడిన వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడింది. ముసురు వర్షంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడ్డారు. షాద్‌నగర్ మున్సిపాలిటీలోని గోల్డెన్‌పార్క్ కాలనీలో నివాసాల మధ్య వర్షపునీరు నిలువడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతి చిన్నపాటి వర్షానికే నివాసాల మధ్య వర్షపునీరు చేరుతున్నాయని, నివాసాల మధ్య వర్షపునీరు నిలువకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



షాద్‌నగర్‌లో గోల్డెన్‌పార్క్‌లోని నివాసాల మధ్య నిలిచిన వర్షపునీరు



చేవెళ్లటౌన్: ఎస్సీ బాలుర వసతి గృహంలో నిలిచిన వర్షం నీరు

**చేవెళ్లలో కురిసిన భారీ వర్షం**

చేవెళ్లటౌన్ : చేవెళ్లలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం ఎదుట వర్షం నీరు నిలిచింది. అదే విధంగా ఆరు కాలం కష్టం చేసి పండించి కోసి చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఆరబోసిన వరి ధాన్యం పూర్తిగా తడిసి ముద్దయింది. దీంతో రైతులు చేతికి వచ్చిన పంట పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## బురద రోడ్డుపై నడక సాగేదెలా..



సలిగుట్ట తండాకు వెళ్లే రోడ్డు బురదతో నిండిన దృశ్యం

మంచాల, డిసెంబర్ 8: చిన్నపాటి చినుకు పడిందంటే ఆ రోడ్డు బురద మయంగా కావడంతో నడవడమే కష్టతరంగా మారింది. తండా వాసులకు ప్రధాన రహదారి ఇదే. మంచాల మండలం లోయపల్లి పంచాయతీ అనుబంధ గ్రామమైన సలిగుట్ట తండాకు వెళ్లే ప్రధాన రహదారి చిన్నపాటి వర్షానికి లోయపల్లి గ్రామంలోని వర్షపు, మురుగు నీరు ఈ రోడ్డుపైకి రావడంతోనే బురదతో నిండిపోతుంది. రోడ్డును బాగు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని సలిగుట్ట తండా వాసులు వాపోతున్నారు. ఇకనైనా రోడ్డు సమస్యను పరిష్కరించాలని గిరిజనులు అధికారులను వేడుకుంటున్నారు.

## గుర్తుతెలియని మృతదేహం లభ్యం

ఆదిబట్ల, డిసెంబర్ 8: మహేశ్వరం మండల పరిధి రావిరాల చెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఆదివారం ఎస్‌ఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం రావిరాల పెద్ద చెరువులో గుర్తు తెలియని ఓ వ్యక్తి శవం నీటిపై తేలియాడుతుందని స్థానికుల సమాచారంతో శవాన్ని పరిశీలించగా అతడి వయస్సు 20 నుంచి 25 సంవత్సరాలు కలిగి ఉండి 5.7 అడుగుల ఎత్తు, తెలుపు రంగులో ఉన్నాడని తెలిపారు. అతను ధరించిన దుస్తులు నలుపు, తెలుపు రంగులో షర్ట్, ముదురు ఆకుపచ్చ టీ షర్ట్, కుడి చెయ్యి మీద 'అ' అనే అక్షరంతో పచ్చ బొట్టు కలిగి ఉన్నదని పేర్కొన్నారు. నాలుగు రోజులు కిందట మరణించినట్లు తెలిపారు. ఈ మృతదేహం కోసం 8712662671, 8712662364, 8712662383లో ఆదిబట్ల పోలీసులను సంప్రదించాలని కోరారు.

## విద్యాధర చారికి కామధేను జాతీయ పురస్కారం



వనస్థలిపురం, డిసెంబర్ 8 : ప్రముఖ సూక్ష్మ కళాకారుడు డాక్టర్ ముంజంపల్లి విద్యాధర చారికి మరో పురస్కారం లభించింది. విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ అందించే కామధేను జాతీయ పురస్కారం 2024కు ఎంపికయ్యారు. ఆదివారం నగర్‌లోని బేగంపేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూరేపల్లి నందా, సంస్థ సీఈవో సత్యవోలు రాంబాబు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. గతంలో అనితర సాధ్యమైన, అద్భుతమైన సూక్ష్మ కళాకండాలను ఆయన రూపొందించారు. ఆవగింజపై వినాయకుడి చిత్రం, తల వెంట్రుకపై మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం చిత్రం, బియ్యపు గింజపై 133 అక్షరాల జాతీయ గీతాన్ని లిఖించి రికార్డు సృష్టించారు. ఇప్పటికే లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడంతోపాటు, ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. తనను కామధేను పురస్కారానికి ఎంపిక చేసిన జ్యూరీకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి పురస్కారం తన బాధ్యతను పెంచుతుందన్నారు.



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల ప్రజలు

## రోడ్డు పనులు ప్రారంభించండి

ఆదిబట్ల, డిసెంబర్ 8: మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పరిధిలోని చింతపల్లిగూడ క్రాస్ రోడ్డు నుంచి వయా మలిశెట్టిగూడ, రాందాస్‌పల్లి నుంచి బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు ఆదివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నిధులు మంజూరు చేసి రోడ్డు పనులకు టెండర్ వేయిస్తానని హామీ ఇచ్చారు. వారి వెంట కౌన్సిలర్ సంధ్య, బీఆర్‌ఎస్ నాయకులు దయాకర్, వీరారెడ్డి, మాజీ సర్పంచ్ మల్లేశ్‌యాదవ్, శ్రీశైలంయాదవ్, సంజీవ, అమరేందర్, గణేశ్, అరవింద్ ఉన్నారు.

## మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి



దీక్షలో కూర్చున్న మండల సాధన సమితి నాయకులు, గ్రామస్తులు

కడ్తాల్, డిసెంబర్ 8: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆపేదిలేదని మండల సాధన సమితి నాయకులు అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, గ్రామస్తులు రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. దీక్ష చేపట్టిన వారితో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, కార్యదర్శి అనిల్, నాయకులు కృష్ణాజీ, ముత్యాలు, చంద్రయ్య, తిరుమల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మాణిక్యరెడ్డి, బాలయ్య, చెన్నయ్య, మల్లయ్య, జంగయ్య, శివయ్య ఉన్నారు.

## బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కడ్తాల్, డిసెంబర్ 8: తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్‌లో వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పవన్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ అమృత, డైరెక్టర్లు స్వామిగౌడ్, జంగయ్య, ప్రధాన అర్చకుడు నర్సింహాచారి, మాజీ సర్పంచ్ శ్యాంసుందర్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, మాధవాచారి, మల్లేశ్, వెంకటేశ్, శివ, షార్ఫుద్దీన్, విష్ణు పాల్గొన్నారు.

